క్లుప్తంగా

'సభ్యత్వంలో బీజేపీది ప్రపంచ రికార్డు'



సభ్యత్వం అందజేస్తున్న శ్యాంసుందర్‌రావు

బెల్లంపల్లి/తాండూర్: పార్టీ సభ్యత్వంలో బీజేపీది ప్రపంచ రికార్డ్ అని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు గోనే శ్యాంసుందర్ రావు అన్నారు. బెల్లంపల్లి, తాండూర్ ఐబీ కేంద్రంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. దేశ హితాన్ని కాంక్షిస్తూ పోరాడే ఏకైక రాజకీయ పార్టీ బీజేపీ అని కొనియాడారు. ఈ సందర్భంగా వ్యాపార వర్గాలు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తి, కో కన్వీనర్ చిలుముల కృష్ణదేవరాయలు, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్, నాయకులు కె.గోవర్ధన్, రాజులాల్, రామన్న, విజయ్, బీజేపీ తాండూర్ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్ పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రాన్ని ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన అక్కల రమేష్‌ను నియమించినట్లు, బీసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నియామక పత్రాన్ని అందించారు. బీసీలు సంఘటితంగా ఉండి డిమాండ్ల సాధనే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గగ్గూరీ సత్తయ్య, రాజన్న ఉన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికులుగా 345మంది పనిచేస్తున్నారని, వారసత్వ ఉద్యోగాలను కల్పించాలని కోరుతూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. వారసత్వ ఉద్యోగాలను కల్పించకుండా అదనంగా కొత్తగా 30మంది కార్మికులను తీసుకున్నారని, అందులో పులివైల సాయికిరణ్ అనే వ్యక్తిని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడిగా పేరును అక్రమంగా నమోదు చేయడంతో పాటు, పీఎఫ్‌ను అందిస్తున్నారని, వెంటనే అతడి పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. 20వ తేదీలోపు చర్యలు తీసుకోకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, అధ్యక్షుడు కుంట రాయమల్లు, ప్రధాన కార్యదర్శి ఆవునూరి గోపాల్ పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతు



నీటిని పట్టుకుంటున్న స్థానికులు

సాక్షి స్పందన

భీమారం: 'నీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా' అనే శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ ద్వారా బోరుబావి వద్ద విద్యుత్తు స్టార్టర్‌ని కొత్తగా అమర్చారు. దీంతో స్థానికుల నీటి కష్టాలు తీరాయి. నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టేట్ సిబ్బందితో వాగ్వాదం

రామకృష్ణాపూర్: పట్టణంలోని సూపర్‌బజార్ ఏరియాలో గల స్థలం విషయంలో సింగరేణి ఎస్టేట్ సిబ్బందికి, ఓ కుల సంఘం నాయకులకు శుక్రవారం రాత్రి తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆలయ నిర్మాణం నిమిత్తం గతంలోనే తాము అప్పటి ఎమ్మెల్యేతో భూమిపూజ జరిపించామని, ఇప్పుడు తాత్కాలిక ప్రహరీ పెట్టుకుంటే వచ్చి అడ్డుకోవటమేమిటని ఎస్టేట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సింగరేణి అధికారుల అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు ఏవైనా చేపట్టాలని, అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని ఎస్టేట్ సిబ్బంది సూచించారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



జన్నారం: పొన్కల్‌లో గణనాథుడి ముందు దీపాలంకరణ



భీమారంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



బెల్లంపల్లిరూరల్: వినాయకుడి సమర్పించిన నైవేద్యాలు



చెన్నూర్: క్యాంప్ కార్యాలయంలో అన్నదానం



మందమర్రిరూరల్: సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు



ఆర్‌కేపీలో పూజల్లో పాల్గొన్న భక్తులు



చెన్నూర్: భజన చేస్తున్న మర్వాడీ యువకులు

రామకృష్ణాపూర్/బెల్లంపల్లిరూరల్/భీమిని/చెన్నూర్/నెన్నెల/వేమనపల్లి/భీమారం/మందమర్రిరూరల్/జన్నారం: జిల్లా వ్యాప్తంగా గణనాథుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆయా గణేష్ మండపాల వద్ద శనివారం గణనాథుడికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తారకరామకాలనీ, గంగాకాలనీ, హనుమాన్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ బీజో న్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల వద్ద అన్నదానం చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజ రయ్యారు. బెల్లంపల్లి మండల పరిధిలోని చంద్రవెల్లి గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర దేవా లయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భక్తులు 108రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మాలగురిజాల గ్రామంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణేషుడికి 108రకాల నైవేద్యాలు(ప్రసాదాలు) మహిళా భక్తులు సమర్పించారు. చెన్నూర్ పట్టణంలోని మర్వాడీ ధర్మశాలలో యువ మంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండలి వద్ద భజన కార్యక్రమం అలరించింది. నెన్నెల మండలంలోని గంగారాంలో జై వినాయక యూత్ మండపం వద్ద, నెన్నెల కుమ్మరివాడ యూత్ మండపం వద్ద కుంకుమపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి వెంకటేశ్వర శివాలయంలో నీల్వాయి మాజీ సర్పంచ్ గాలి మధు–సుమలత దంపతుల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం చేశారు. భీమారంలోని పాత పోస్టాఫీస్ ఏరియాలోని సాయిరాం గణేష్ మండళి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు, ఫ్రెండ్స్ వినాయక మండలి వద్ద అన్నదానం చేశారు. జన్నా రం మండలం పొన్కల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గననాథుడితో పాటు, రాంనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ప్రత్యేక దీపాలంకరణ చేసి, 108 రకాల నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు. మందమర్రి మార్కెట్ ఏరియాలో వినాయక మండప నిర్వాహకులకు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

రక్తదానాలకు ముందుకు రావాలి



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్: వినాయక మండపాల్లో అన్నదానంతో పాటు, రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల విశ్వకళా సమితి గణేష్ మండలి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించగా 21మంది రక్తదానం చేశారు. మందమర్రిలోని ఆదిల్‌పేట్‌లో హనుమాన్ టెంపుల్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ్ మండలి ఆధ్వర్యంలో 25మంది యువకులు రక్తదానం చేశారు.

రోడ్డుపైకి సాగునీరు



రోడ్డుపై పారుతున్న సాగునీరు

దండేపల్లి: కాల్వల ద్వారా పంట పొలాలకు చేరాల్సిన సాగునీరు, అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్డుపై ప్రవహించింది. దండేపల్లి మండల కేంద్రం సమీపంలో కడెం ప్రాజెక్టు 28వ డిస్ట్రిబ్యూటరీ కాల్వలో శనివారం ఉదయం చెత్త చెదారం నిండుకుపోయింది. ఆంధ్ర కాలనీ వద్ద సాగునీరంతా, రోడ్డుపై నుంచి వరదలా ప్రవహించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని గంటల తర్వాత చెత్తను తొలగించడం, కాల్వకు నీటిగేజ్ తగ్గించి, నీరు రోడ్డుపైకి రాకుండా చేశారు.

పనులు మధ్యలోనే నిలిచినయ్..!



ఏడాది కిత్రం వేసిన రోడ్డు శిథిలమైన దృశ్యం

- రెండేళ్లైనా నిలిచిన పనులకు మోక్షం లేదు..
- కిలోమీటర్ దూరం వరకు వేసిన రోడ్డు కూడా శిథిలం
- నాణ్యత లేక పోవడంతో అక్కడక్కడా పగుళ్లు
- పట్టించుకోని అధికారులు



ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కిలో మీటర్ దూరం వరకు చేపట్టిన పనులు..

దండేపల్లి: పోలీస్‌స్టేషన్ పక్కనుంచి దండేపల్లి మండలంలోని రఘుగూడెం, పాత మామిడిపల్లి మీదుగా, ఊట్ల గ్రామం వరకు (సుమారు 7కిలో మీటర్ల పొడవు) బీటీ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా రూ.2కోట్లు, నిధులు మంజూరు చేసింది. ఈ పనులను అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ 2021లో ప్రారంభించారు. 2022లో పనులు చేపట్టారు. అది కేవలం పోలీస్‌స్టేషన్ పక్కనుంచి రఘుగూడెం వాగు వరకు అంటే కేవలం కిలో మీటరు దూరం వరకే పనులు చేసి నిలిపివేశారు.

రెండేళ్లుగా పనులు ఊసేలేదు...

రోడ్డు ప్రతిపాదనలు, నిధుల విషయంలో దండేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఊట్ల గ్రామం వరకు అని చెప్పినప్పటికీ, పనులు మాత్రం రఘుగూడెం సమీపంలోని వాగు వరకు మాత్రమే చేపట్టి మిగితా పనులు మధ్యలోనే నిలిపివేశారు. పైగా పనులు నిలిపివేసి కూడా రెండేళ్లు గడుస్తోంది.. అంతే తప్పా మళ్లీ పనుల ఊసేలేదు.. దీనిని బట్టి చూస్తే, ఊట్ల రోడ్డు నిర్మాణం ఉత్తకథే అనిపిస్తుంది.

వేసిన రోడ్డు శిథిలం..

కిలో మీటరు వరకు నిర్మించిన బీటీ రోడ్డు రెండేళ్లకే నూరేళ్లు నిండినట్టుగా కనిపిస్తుంది. అప్పుడే రోడ్డు అక్కడక్కడ శిథిలమైంది. అయినా దానికి ఎలాంటి మరమ్మతు కూడా చేపట్టడం లేదు. వాగు సమీపంలో సీసీ వేశారు. దానికి కూడా అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోనే, పనుల్లో నాణ్యత లోపం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది.

నిధుల కొరతే కారణమా?

రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరైనప్పటికీ, అవి కేవలం కిలో మీటరు రోడ్డుతో పాటు, మధ్యలో ప్రవహించే వాగుపై నిర్మించిన వంతెన వరకే నిధులు ఖర్చయ్యాయ? లేక, పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదా? అనే పూర్తి వివరాలతో పాటు, రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలు తెలుసుకునేందుకు సంబంధిత ఏఈ, డీఈలకు ఫోన్ చేసినా ఎవరు స్పందించలేదు.

మిషన్ భగీరథ లీకేజీ

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని ఆరెపల్లిక్రాస్ వద్ద మిషన్ భగీరథ నీటి పైపులైను లీకేజీకి గురైంది. దీంతో రోడ్డుపైనే నీరు పారుతుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగా లీకైన నీటిపైపులో కలుషితమైన నీరు కలుస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పైపులైను లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సతీశ్ రెడ్డి, ప్రత్యేకాధికారి, భీమారం సెల్ నంబర్: 91105 70605

మున్సిపాలిటీ హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులకు మున్సిపాలిటీ హెచ్‌ఆర్‌ఏను వెంటనే చెల్లించాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ కోరారు. సీఎస్పీలో శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీగా ఏర్పడి ఆరేళ్లు అయినా, ఇంకా సీఎస్పీ, సివిల్, ఏరియా ఆసుపత్రి, రెస్క్యూ, ఆర్‌కే ఓసీ ఉద్యోగులకు మున్సిపాలిటీ హెచ్‌ఆర్‌ఏ చెల్లించటం లేదన్నారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పట్టింపులేకుండా ఉంటున్నాయన్నారు. సీఎస్పీలో హౌస్‌కీపింగ్ కోసం గతంలో నలుగురు ఉద్యోగులుండగా, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, మల్లేశం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనిముట్ల కొరత తీర్చాలి

శ్రీరాంపూర్: పని స్థలాల్లో పనిముట్ల కొరత లేకుండా చూడాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదాలు శనివారం ఆర్కే 5 గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సత్తిరెడ్డి భోగ ముదునయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏరియాలో నియర్ బై వాలీబాల్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో శనివారం నియర్ బై (మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు) వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంవీటీసీ మేనేజర్ శంకర్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మందమర్రి, బెల్లంపల్లి జట్లు పాల్గొనగా, మందమరి జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ అశోక్, కో ఆర్డినేటర్ శివ కృష్ణ, వాలీబాల్ కెప్టెన్ వంగ రాములు, క్రీడాకారులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

'వేతనంలో కోత వద్దు'



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్: వరద బాధితుల సహాయార్థం కార్మికుల ఒక రోజు వేతనం ఇవ్వాలనే నిర్ణయం సరికాదని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాల్లో నుంచి కాకుండా కంపెనీ సీఎస్ఆర్ నిధుల్లో నుంచి ఇవ్వాలని కోరారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా వేతనాల నుంచి రికవరీ చేయరాదన్నారు. వరద బాధితులను ఆదుకోవడం కోసం గనులపై విరాళాలు సేకరించుకోవచ్చన్నారు. అప్పుడు కార్మికులకు తోచినంత సహాయం అందిస్తారని తెలిపారు.

మందమర్రిరూరల్: ఇటీవల వర్షాల వల్ల ఏర్పడిన నష్టానికి బాధితుల సహాయార్థం సింగరేణి కార్మికుల నుంచి వేతనంలో ఒక్క రోజు వేతనం కోత విధించే విధానం వద్దని, కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందని కేకే 5 కార్మికులు ఆందోళనకు దిగారు. గని మేనేజర్ ప్రవీణ్‌కు శనివారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. కోత విధించే విధానాన్ని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: పట్టణంలో మంగళవారం జరిగే వినాయక నిమజ్జనం ఏర్పాట్లను హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, పట్టణ సీఐ బన్సీలాల్‌లు శనివారం పరిశీలించారు.

'పోలీసుల పల్లె నిద్ర'

తాండూర్: కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు కలిసికట్టుగా జీవించాలని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. 'పోలీసు పల్లె నిద్ర'లో భాగంగా శుక్రవారం రాత్రి తాండూర్ మండలం కొత్తపల్లిలో నిద్రించారు. గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా గ్రామస్తులు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

'మహాలక్ష్మి' పత్రాలు అందజేత

తాండూర్/భీమిని: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వరుసక్రమంగా అమలు చేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. తాండూర్ మండలం మాదారంలో, కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, కన్నెపల్లిల్లో శనివారం లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకం హామీ పత్రాలు అందజేశారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

వేమనపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాదవ్, వేమన యూత్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లా ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభమైంది. స్థానిక మాజీ సర్పంచ్ కుబిడె మధుకర్, బీఆర్‌ఎస్ నాయకుడు సాయికుమార్ పోటీలను ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించనున్న కబడ్డీ పోటీల్లో సుమారు 40క్రీడా జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సారా తస్నీమ్

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సారా తస్నీమ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రెస్‌క్లబ్ కమిటీకి సన్మానం

దండేపల్లి: నూతనంగా ఎన్నికైన మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిగౌడ్, రాజన్నతో పాటు, కార్యవర్గానికి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మేదరిపేటలోని ఓ ప్రైవేటు కాలేజీలో సన్మానం చేశారు.

లింగన్నపేటలో వైద్యశిబిరం

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట ఎస్సీ కాలనీలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరలక్షణాలతో బాధపడుతున్న వారి రక్త నమునాలను సేకరించి మందులు పంపిణీ చేశారు.

రామాయణంపై వ్యాసరచన

దండేపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయం వద్ద శివపావని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రామాయణం పై విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సాయం

జైపూర్: జైపూర్ హైస్కూల్లో 2000 సంవత్సరంలో తమతో కలిసి చదువుకున్న కండుగుల దక్షిణమూర్తి ఇటీవల మృతి చెందాడు. కాగా ఆనాటి స్నేహితుల బృందం కొత్తూరులో వారి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిత్రులు అరిగెల శ్రీనివాస్ గౌడ్, సహార రమేశ్, గద్దల తిరుపతి, కామెర మల్లేశ్, వెంకటస్వామి, వేణు, తిరుపతి, తులసిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

దండేపల్లి: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

కళాశాలలో సంచార గ్రంథాలయం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో రెండో శనివారం సందర్భంగా ప్రిన్సిపాల్ రమాకళ్యాణి స్వచ్ఛంద సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు.

త్వరలో బీసీ కులాల ఐక్య సమావేశం

మందమర్రిరూరల్: త్వరలో మందమర్రి పట్టణ బీసీ కులాల ఐక్యసమావేశం నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్లో శనివారం బీసీ కులాలకు సంబంధించిన నాయకులు సమావేశం నిర్వహించారు. పట్టణంలోని బీసీలకు సంబంధించిన అన్ని కులాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురితో ఐక్య సమావేశం ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకొని బీసీ సంఘాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని పేర్కొన్నారు. బీసీ కులస్తులు అందరూ పాల్గొని సంఘం బలోపేతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మిట్ట లక్ష్మణ్ పటేల్, పార్వతి రాజిరెడ్డి, గాజుల సుదర్శన్, కుదిరే అంజయ్య, మాయ శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్, సమ్మయ్య యాదవ్, మడ్డి వేణుగోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.